క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. న్యూశాయంపేట ప్రాంతంలో ఉదయం 8.30నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కాజీపేటలో పోలీసుల తనిఖీలు



కాజీపేట: సంక్రాంతి పండుగ ఆరంభం నుంచి కాజీపేట పట్టణంలో పోలీసుల తనిఖీలు ముమ్మరంగా సాగుతున్నాయి. స్థానికంగా టౌన్ రైల్వే స్టేషన్‌తో పాటు జంక్షన్, బస్టాండులు, ప్రధాన రహదారుల్లో బుధవారం తెల్లవారుజాము వరకు తనిఖీలు నిర్వహించారు. ఏసీపీ డేవిడ్‌రాజ్ పర్యవేక్షణలో సీఐ సార్ల రాజు, ఎస్సైలు లవన్‌కుమార్, శివకుమార్ వేర్వేరుగా సిబ్బందితో కలిసి సోదాలు జరిపారు. టాబ్ సహాయంతో అనుమానితుల వేలిముద్రలు సేకరించి గతంలో ఏమైనా కేసులు ఉన్నాయా అనే కోణంలో పరిశీలించారు.

వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై హర్షం

హన్మకొండ అర్బన్: కేంద్ర ప్రభుత్వ సర్వీసు ఉద్యోగులు, పెన్షనర్లకు ఉచిత వైద్య చికిత్సల నిమిత్తం వరంగల్‌లో వెల్‌నెస్ సెంటర్ (సీజీహెచ్ఎస్)ను కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేయడంపై తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, హనుమకొండ జిల్లా శాఖ తరఫున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 వెల్‌నెస్ సెంటర్ ప్రారంభోత్సవానికి వస్తున్న సీజీహెచ్ఎస్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు ఘనంగా స్వాగతం పలుకనున్నట్లు పేర్కొన్నారు.

మున్నూరుకాపు సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



హన్మకొండ: మున్నూరుకాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా –2024 క్యాలెండర్‌ను హనుమకొండ రాంనగర్‌లోని తన స్వగృహంలో రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, మున్నూరుకాపు సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కటకం పెంటయ్య, నాయకులు కనుకుంట్ల రవికుమార్, తోట పవన్, పాటి శ్రీనివాస్, పెరుకారి శ్రీధర్, పూజారి సత్యనారాయణ, మాదాసు మొగులయ్య, ముప్ప వేణు, కక్ర సుదర్శన్, శ్రీధర్, నీలారపు శ్రీనివాస్, ఒడిదల రాము, తదితరులు పాల్గొన్నారు.

మేదరి సంఘం క్యాలెండర్..



హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర మేదరి సంఘం –2024వ సంవత్సర క్యాలెండర్‌ను పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆవిష్కరించారు. హనుమకొండ భవానీనగర్‌లోని తన స్వగృహంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, తెలంగాణ రాష్ట్ర మేదర సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ప్రతాపగిరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వలపిరెడ్డి సుధీర్ కుమార్, ప్రచార కార్యదర్శి మస్నా విజేందర్, నాయకులు కోరుట్ల రమేష్, చిలువేరు సురేందర్, ప్రతాపగిరి వెంకటరమణ మూర్తి, మస్న కుమార్, రమేష్, తుమ్మల యాకయ్య, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు



శాయంపేట : మండల కేంద్రంలోని రైతు బజారులో బుధవారం సాధనాశూరుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరు గ్రామానికి చెందిన సాధనశూరులు.. మంత్రాలు లేవని, మూఢనమ్మకాలను నమ్మవద్దని పాటల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా చింతకింది శంకర్, సమ్మయ్య, శోభన్‌బాబు, మధు, వెంకన్న, గంజి సతీష్, అశోక్, వెంకన్న.. నెత్తిపై కట్టెల పొయ్యి పెట్టి అప్పడాలు కాల్చడం, నీటిలో వేసిన పసుపును ముద్దలుగా తీయడం, తాళ్లతో బంధించడం వంటి తదితర విన్యాసాలు చేసి ఆకట్టుకున్నారు. అనంతరం స్థానిక ఎంపీటీసీ బాసాని చంద్రప్రకాశ్, సర్పంచ్ కందగట్ల రవి, పద్మశాలి కులపెద్దలు బాసాని లక్ష్మీనారాయణ, సదాశివుడు, వలుపదాసు వెంకటరమణ, మామిడి చంద్రమౌళి నుంచి సేకరించిన ఆర్థిక సాయాన్ని వారికి అందించారు.

శ్రమకు ప్రతిరూపమే సంక్రాంతి క్రీడలు



మామునూరు: బహుమతులు ప్రదానం చేస్తున్న రత్నమాల



బహుమతులు అందజేస్తున్న అతిథులు

మామునూరు: మహిళలు, యువతుల శ్రమకు ప్రతిరూప ప్రతిభయే సంక్రాంతి క్రీడలు అని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి నలిగంటి రత్నమాల అన్నారు. సంక్రాంతి, కనుమ పండుగల సందర్భంగా ఖిలా వరంగల్ మండలం లక్ష్మీపురం బెస్తం చెరువు కాలనీలో ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), డీవైఎఫ్ఐ యువజన సంఘం సంయుక్త ఆధ్వర్యంలో మహిళలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై ముగ్గుల పోటీలను ప్రారంభించి మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలేక నవధాన్యాలు పేదవాళ్లకు అందుబాటులో లేవని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పిస్తే అన్ని రకాల పంటలను రైతులు పండించి దేశాన్ని సస్యశ్యామలం చేస్తారని చెప్పారు. అలాగే, పేదరికం తగ్గుతుందని అన్నారు. ఎన్నికల హామీలను ప్రభుత్వాలు అమలు చేసి ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించాలని కోరారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఉదయశ్రీ, వెంకటలక్ష్మి, కల్పన, అనిత, డీవైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను పిల్లలకు వివరించాలి

హసన్‌పర్తి: పండులు, సంప్రదాయాల గురించి పిల్లలకు వివరించి చెప్పాలని లయన్స్ జిల్లా లీడర్‌షిప్ సమన్వయ కర్త డాక్టర్ అజిత్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వర ఆలయ ప్రాంగణంలో హసన్‌పర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఏటా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పి.హైమావతి, ద్వితీయ బహుమతి ఎస్.రవళి, తృతీయ బహుమతి టి.దీపిక గెలుచుకున్నారు. అనంతరం ముగ్గుల పోటీల విజేతలను అభినందించారు. క్లబ్ అధ్యక్షుడు ఎల్కరాజు శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్లు పాపిశెట్టి కిరణ్, నాగమళ్ల సుధీర్, క్లబ్ కార్యదర్శి ఇనుముల కృపాకర్, తోట సంపత్, ఆత్మ చైర్మన్ కందుకూరి చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్



మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న నరేందర్, ఇన్‌స్టిట్యూట్ బాధ్యులు

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేడియంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సికింద్రాబాద్ డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ బుధవారం రెండవ రోజు కొనసాగింది. రైల్వే ఆస్పత్రి సీనియర్ డీఎంఓ డాక్టర్ నరేందర్ హిర్వాని, వరంగల్ సీఐ నరేష్, కాజీపేట సీఐ సంజీవరావు హాజరై టాస్ వేసి మ్యాచ్‌లను ప్రారంభించారు. మొదటి మ్యాచ్‌లో రైల్వే ట్రాక్‌మిషన్ ఇంజనీరింగ్ జట్టు – ఆపరేటింగ్ జట్టు తలపడగా ఆపరేటింగ్ జట్టు విజయం సాధించింది. రెండవ మ్యాచ్ ఆర్‌పీఎఫ్ జట్టు – ఎలక్ట్రిక్ లోకోషెడ్ జట్టు మధ్య జరగగా ఆర్‌పీఎఫ్ టీమ్ గెలుపొందింది. కార్యక్రమంలో రైల్వే ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవులపల్లి రాఘవేందర్, జాయింట్ సెక్రటరీ ఎం.రాజయ్య, ట్రెజరర్ జి.రాజేశ్వర్, సభ్యులు దారావత్ రఘు, పి.ప్రశాంత్, ఎస్.ప్రవీణ్, ఎం.మహేష్, సునీల్, ఎం.రవికుమార్, రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

భద్రకాళి అమ్మవారికి పూజలు



హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని హైదరాబాద్ ఇండియన్ ఇమ్యునోలాజికల్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.ఆనంద్ కుమార్ బుధవారం సందర్శించారు. ఈమేరకు ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. తొలుత ఆదిశంకరులు, వల్లభ గణపతిని ఆనంద్ దర్శించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, ఆలయ స్నపన మందిరంలో ఆనంద్‌కుమార్‌కు అర్చకులు మహాదాశీర్వచనం అందజేశారు.

సమస్యలు పరిష్కరించుకుందాం..



ఎన్నికైన ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ కమిటీ

వరంగల్: ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకుందామని వరంగల్ జిల్లా ఐజేయూ అధ్యక్షుడు శ్రీరామ్ రామ్‌చందర్, కార్యదర్శి మట్ట దుర్గాప్రసాద్ అన్నారు. ది అర్బన్ స్పైస్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన సమావేశంలో తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నూతన కమిటీని సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉర్దూ జర్నలిస్టులకు ఐజేయూ అండగా ఉండి సంఘం బలోపేతానికి సహకరిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఉర్దూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎండీ.సాజిద్, ఉపాధ్యక్షుడు అబ్దుల్ అక్రమ్, కోశాధికారి ఎండీ.అమీర్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యులు సంగోజు రవి, మిద్దెల రంగనాథ్, వడిచర్ల శ్రీనివాస్, విజయ్ రాజ్, చిన్నబాబు, శ్యామ్, సిద్దోజు నితీష్ పాల్గొన్నారు.

పార్ట్‌టైం ఉద్యోగం ఇప్పిస్తామని మోసం

● రూ.1.04 లక్షలు లాగేసిన సైబర్ నేరగాళ్లు



గీసుకొండ : 'నీకు పార్ట్‌టైం ఉద్యోగం ఇప్పిస్తాం.. అలాగే పలు టాస్క్‌లు పూర్తి చేస్తే నజరానాగా రెట్టింపు డబ్బు ఇస్తాం' అంటూ సైబర్ నేరగాళ్లు మాయమాటలు చెప్పి ఓ వ్యక్తి నుంచి రూ.1,04,800 కొల్లగొట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన దయ్యాల రాజేశ్‌కు గత ఏడాది డిసెంబర్ 8న వాట్సాప్ నుంచి పార్ట్‌టైం ఉద్యోగం ఇప్పిస్తామంటూ ఓ మెసేజ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు పంపారు. పైగా ఉద్యోగం కావాలంటే టెలిగ్రాం నుంచి అతడిని మెసేజ్ చేయమని లింక్ పంపించారు. అలాగే, తాము చెప్పే టాస్క్‌లు పూర్తి చేస్తే ఎక్కువ డబ్బులు పంపిస్తామంటూ పలు దఫాలుగా మేసేజ్ చేశారు. పలుమార్లు టాస్క్ పూర్తిచేస్తే ఎక్కువ డబ్బు వచ్చింది. అదే ఆశతో రాజేశ్ తన గూగుల్‌పే, పలు బ్యాంకు ఖాతాల ద్వారా షబ్బీర్ అలీఖాన్ అనే వ్యక్తికి, సన్‌క్యోమ్ ఇంట్రా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల పేరుతో ఉన్న ఖాతాలకు నాలుగుసార్లు మొత్తం రూ.1,04,800ను పంపించాడు. అయితే డబ్బులు తనకు తిరిగి రావడం లేదని అడిగితే అకౌంట్ హోల్డ్‌లో పడిందని, చెప్పి అప్పటి నుంచి లావాదేవీలు, మెసేజ్‌లు పంపడం నిలిపేశారు. మోసపోయానని గ్రహించిన బాధితుడు బాధితుడు ఇటీవల సైబర్ క్రైంకు, తాజాగా బుధవారం గీసుకొండ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా గీసుకొండ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ గుర్తుతెలియని మెసేజ్‌లు, ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఇన్‌స్టాగాం ద్వారా వస్తే వాటికి స్పందించవద్దని సూచించారు.

'చెకుముకి' వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వేదిక సభ్యులు

కాజీపేట: సైన్స్ టాలెంట్ టెస్ట్ వాల్‌పోస్టర్లను జాతీయ అవార్డు గ్రహీత, ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ పరికిపండ్ల అశోక్, జనవిజ్ఞాన వేదిక సభ్యులు బుధవారం కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిఏటా విద్యార్థులకు నిర్వహించే చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షను విజయవంతం చేయాలని వక్తలు ఆకాంక్షించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, బీసీ స్టడీ సర్కిల్ మాజీ డైరెక్టర్ విజయ్‌కుమార్, పాము రాజేష్‌కుమార్, అభిషేక్, సత్యనారాయణ, రమేష్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

జైశ్రీరామ్ జెండాలను ఎగురవేయాలి



జెండాలు పంపిణీ చేస్తున్న ట్రస్టీలు

వరంగల్: అయోధ్యలో 22న బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతీఇంటిపై జైశ్రీరామ్ జెండాలను ఎగురవేయాలని శివానంద గురు కల్చరల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ త్రిపురనేని గోపీచంద్ సూచించారు. ములుగురోడ్డు సమీపంలోని గురుధామంలో జైశ్రీరామ్ అనే నినాదంతో ఉన్న ఆంజనేయస్వామి సమేత జెండాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెండాల కోసం భక్తులు గురుధామంలో సంప్రదించాలని చెప్పారు. జెండాలు కావాల్సిన వారు 98484 23133 నంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్టీలు బండారు సాయినారాయణ, మాదారపు సదాశివుడు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి ఎస్‌యూవీ న్యూ క్రెటా



కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న బోనాల కిషన్, షోరూమ్ ప్రతినిధులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ ములుగురోడ్డు జంక్షన్ సమీపంలోని హేమా హ్యూందాయ్ షోరూంలో కొత్త క్రెటా కారును వరంగల్ ఏసీపీ బోనాల కిషన్ చేతుల మీదుగా వరంగల్ మార్కెట్‌లోకి బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో నగరాలతో పోటీ పడుతూ వరంగల్ ప్రజలకు నూతన మోడల్ కార్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని ప్రశంసించారు. షోరూం మేనేజింగ్ డైరెక్టర్ యుగేందర్ మాట్లాడుతూ ఎస్‌యువీ క్రెటా కొత్త వెర్షన్ ఎక్స్‌షోరూం ధర రూ.10.99 లక్షల నుంచి రూ.19.99 లక్షల వరకు ఉన్నట్లు తెలిపారు. అందులో 1.5 ఎంపీఐ పెట్రోల్, 1.5 డీజిల్ ఆర్‌డీఐ, 1.5తో టర్బో ఇంజన్, 36స్టాండర్డ్ సేఫ్టీ ఫీచర్స్, 70 అడ్వాన్స్‌డ్ సేఫ్టీ ఫీచర్లు, ఎయిర్ బ్యాగులు, 4డిస్క్‌బ్రేక్, ఫ్రంట్ పార్కింగ్ సెన్సార్స్, బ్లైండ్ స్పాట్‌వ్యూ మానిటర్, అడాస్, పానరామిక్ సన్‌రూఫ్, బోస్ స్పీకర్స్, ఏడు రంగుల్లో అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్, పృథ్వీ, ఆదిత్య, ఏజీఎం మహేష్, సేల్స్ మేనేజర్ లక్ష్మణ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణపై ప్రచారం

కరీమాబాద్ : భారత ఎన్నికల సంఘం మొదటి ప్రత్యేక సంక్షిప్త ఓటరు జాబితా సవరణ కోసం జారీ చేసిన షెడ్యూల్‌లో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించనున్నట్లు వరంగల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. బూత్ లెవల్ అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా, సంబంధిత ఫారాలతో ఉదయం 10 గంటల నుంచి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. 1-1-2024 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు, ఓటరుగా నమోదు కాని వారు, ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణలు, శాసనసభ నియోజకవర్గంలోని ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి, ఇతర శాసనసభ నియోజకవర్గానికి మార్పిడి క్లెయిమ్స్, అభ్యంతరాల దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

చెత్త సేకరణపై సిబ్బందికి ఆదేశాలు



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్‌లోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య సిబ్బంది పనితీరును కార్పొరేటర్ విజయశ్రీ బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. చెత్త సేకరణ, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయడంలో పాటించాల్సిన అంశాలపై సిబ్బందితో చర్చించారు. వారి సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు చెత్తాచెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పారేయొద్దని తెలిపారు. తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని కోరారు. పరిశుభ్రతతో రోగాలు దరిచేరవని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, టీపీసీసీ కార్యదర్శి సయ్యద్ రజాలీ, తదితరులు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం



ఆత్మకూరు : మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర పనులు చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఈఓ శేషగిరి అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆదేశానుసారం వీఐపీ భక్తుల క్యూలైన్ కొరకు స్టీలు రెయిలింగ్ ఏర్పాటు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ముందుకు వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. బుధవారం ఆయన జాతర క్యూలైన్లను పరిశీలించి అమ్మవార్లను దర్శించుకున్నారు. చౌళ్లపల్లి సర్పంచ్ రవికుమార్, గీసుకొండ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

అవినీతిపై విచారణ చేయించాలి



వినతిపత్రం అందజేస్తున్న చేనేత లబ్ధిదారులు

హన్మకొండ అర్బన్: మడికొండ టెక్స్‌టైల్ పార్కు పాలకవర్గం, బిల్డర్లు, కెనరా బ్యాంక్ అధికారులు కుమ్మక్కై చేనేత లబ్ధిదారులను నమ్మించి మోసం చేశారని, ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేయించి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరారు. ఈమేరకు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను బుధవారం కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలస కార్మికుల నిర్మూలనలో భాగంగా కార్మికుల ఉపాధి కల్పనకు అప్పటి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ట్రస్ట్ ఫర్ మైక్రో, స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ స్కీం కింద 2019లో ఒక్కో లబ్ధిదారుడికి రూ. 92.50 లక్షల చొప్పున వరంగల్, హనుమకొండ కెనరా బ్యాంక్ బ్రాంచ్‌ల ద్వారా నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. ఆ నిధులతో మడికొండ శివారులో 60 ఎకరాల భూమిని సొసైటీకి చెందిన 364 మంది సభ్యులకు ఒక్కొక్కరికి 450 చదరపు గజాల చొప్పున ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కేటాయించినట్లు వివరించారు. పాత మిషనరీకి రంగులు వేసి రూ. 41.75 లక్షల విలువ చేసే మిషన్లను పాలకవర్గం తీసుకొచ్చి తమకు అంటగట్టారని వాపోయారు. అదేవిధంగా లబ్ధిదారులకు తెలియకుండానే షెడ్ నిర్మాణం చేపట్టి రూ.22 లక్షలకు బదులుగా రూ.45 లక్షల వరకు ఖర్చు అయినట్లు చూపించి బిల్డర్ల ఖాతాలోకి బ్యాంక్ అధికారులు నిధులు మళ్లించారని తెలిపారు.

అయోధ్య రాముడి అక్షింతల వితరణ



ఊరేగింపులో ట్రస్ట్ సభ్యులు, తదితరులు

హన్మకొండ అర్బన్: నగరంలోని వడ్డెపల్లిలో శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో డోలు వాయిద్యాలు, సన్నాయి మేళతాళాల మధ్య ఊరేగింపుగా అయోధ్య రాముడి అక్షింతలను ఊరేగిస్తూ బుధవారం ఇంటింటా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ దాస్యం అభినవ్ భాస్కర్ మాట్లాడుతూ చరిత్రలో జనవరి 22వ తేదీ సువర్ణ అక్షరాలతో లిఖించదగినదని చెప్పారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ అర్చకుడు వామన్ శర్మ, శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ తెలంగాణ మహా సంయోజక్ ముడుపు యాదిరెడ్డి, వరంగల్ మహానగర సహ సంయోజక్ శ్రీరాం ఉదయ్, సభ్యులు నందాల చందర్‌బాబు, నేలకొండ భాస్కర్‌రావు, అర్చకుడు ప్రవీణ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్ విజేతకు అభినందన



శివాత్మికను అభినందిస్తున్న ఎంపీ దయాకర్

వరంగల్ స్పోర్ట్స్: రాజస్తాన్ స్కై మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జైపూర్‌లోని గ్యాన్ విహార్ యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో రెడ్డికాలనీకి చెందిన సీహెచ్.శివాత్మిక పాల్గొని వెండి పతకం సాధించింది. హనుమకొండ బీఎంఆర్ కరాటే డూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న శివాత్మిక.. అండర్ –17, 42 కిలోల విభాగంలో తలపడి ప్రతిభ కనబరిచింది. ఈమేరకు ఆమెను తన నివాసంలో వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో అకాడమీ ఫౌండర్ బండారి సంతోష్ ఉన్నారు.

దేవాలయంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

వరంగల్ చౌరస్తా: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ అభియాన్(మన గుడులను శుభ్ర పరుచుట) కార్యక్రమాన్ని స్టేషన్ రోడ్డులోని ఆకారపు కాశీ విశ్వేశ్వర దేవాలయాన్ని భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో బుధవారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 14నుంచి 22వ తేదీ వరకు మోదీ ఆదేశాలను సంపూర్ణంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. స్వచ్ఛ తీర్థ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, రత్నం సతీష్, నాయకులు చీటూరి అశోక్, గంట రవికుమార్, బాకం హరిశంకర్, ఎరుకల రఘునాథ్ రెడ్డి, అపురూప రజనీష్, ధర్మపురి రామారావు, జెట్లింగ్ శివప్రసాద్, అంకాల జనార్దన్, ఇనుముల రాజు, గడ్డం భాస్కర్, కాంద్రాతి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రోహిత్ వేములకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బీఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్: తెలంగాణ మలిదశ ఉద్యమంలో అమరుడైన రోహిత్ వేముల వర్ధంతిని బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా రోహిత్ చిత్రపటానికి బీఎస్ఎఫ్ కేయూ ప్రధాన కార్యదర్శి నర్సింహ, ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, తదితరులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన త్యాగాన్ని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో అజిత్, అమూల్య, కీర్తికిరణ్, అనూష, రఘువరన్, నరేష్, వినోద్, చరణ్, నిఖిల్, అర్వజ్, రోహిత్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ లోకల్ కోర్టు

కమలాపూర్ : విద్యుత్ వినియోగదారులకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ కార్యాలయంలో ఈనెల 19వ తేదీన విద్యుత్ వినియోగదారుల లోకల్‌కోర్టు ఏర్పాటు చేస్తున్నట్లు టీఎస్ఎన్పీడీసీఎల్ చైర్ పర్సన్ (ఎఫ్ఏసీ), సీజీఆర్ఎఫ్-1 కె.తిరుమల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోకల్ కోర్టులో విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్చటం, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదల, లోపాలు ఉన్న మీటర్లు మార్చడం, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీరణ, సర్వీసు పేరు మార్పు, తదితర సమస్యల పరిష్కారానికి విద్యుత్ వినియోగదారులు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని తిరుమల్‌రావు కోరారు.

చెత్తకు నిప్పు.. ప్రజలకు ఇక్కట్లు



చెత్తకు నిప్పుపెట్టిన గుర్తుతెలియని వ్యక్తులు

కాజీపేట: కాజీపేట పట్టణంలోని రైల్వే క్వార్టర్స్ ఆవరణలో ఉన్న చెత్తకుప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున నిప్పు పెట్టారు. దాంతో సమీప ప్రాంతాల్లోని ప్రజలు, వ్యాపారులు తీవ్ర అవస్థలు ఎదుర్కొన్నారు. కాలుతున్న చెత్తనుంచి దుర్వాసన రావడంతో చిన్న పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవలి కాలంలో చెత్తను క్వార్టర్స్ ఆవరణలోనే కాల్చివేస్తుండడాన్ని రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. తగు చర్యలు తీసుకోవాలని కోరారు.